''ఏమండీ! నా పాపను నాకు దూరం చేసి నా గుండెల్లో ఆరని మంటలు రగిలించకండి. పాపను విడిచి ఒక్క క్షణం కూడా బ్రతకలేను. నవమాసాలు మోసి కనిపెంచిన పాపను నా నుండి నిర్దాక్షిణ్యంగా తీసి కెళ్ళడానికి మీకు మనసెలా ఒప్పింది? కన్న తల్లి కడుపు కోతను అర్థం చేసుకోండి. నాకు ఆస్తీ, అంతస్తు ఏవీ అక్కర లేదు. అవన్నీ మీకే యిచ్చేస్తాను. నా పాపను మాత్రం నాకు వదిలి వెళ్ళండి'' అనూష కన్నీళ్ళతో భర్త పాదాలపైపడి బ్రతిమాలుతున్నది.

''కట్!'' చెప్పాడు దర్శకుడు. అనూష దగ్గరకు వెళ్ళి అభినందిస్తూ ''కంగ్రాట్యులేషన్స్!, మిస్ అనూషా! అత్యంత సహజంగా, అద్భుతంగా నటించి ఫస్ట్ టేక్‌లోనే షాట్ ఓ.కే. చేశారు. రియల్లీ యు ఆర్ ఎ జీనియస్. గ్లిజరిన్ అవసరం లేకుండానే మీ కళ్ళల్లో కన్నీళ్ళు రావడం చూస్తుంటే పాత్రలో మీరెంత డీప్‌గా యిన్‌వాల్వ్ అవుతారో ఆశ్చర్యంగా వుంది. కీపిట్ అప్'' అన్నాడు.

అనూష సగర్వంగా నవ్వింది. రచయిత, నిర్మాత ఒక్కొక్కరే వచ్చి తల్లి పాత్రలో ఆమె నటనను అభినందించారు. షాట్ పూర్తికాగానే కారెక్కి వెళ్ళిపోయింది అనూష.

* * *

''మళ్ళీ ఎందుకొచ్చావు? మొన్ననేగా రెండు వేలు తీసికెళ్ళావు? పైగా వీడిని ఎందుకు వెంట బెట్టుకొచ్చావు?'' కోపంగా అడిగింది అనూష. ఆమె ఎదురుగా నిల్చుని వున్న వ్యక్తి భయంగా చేతులు కట్టుకుని వున్నాడు. దూరంగా ఆరేళ్ళ కుర్రవాడు నిలుచుని బిక్కు బిక్కుమంటూ యిద్దరినీ మార్చి మార్చి చూస్తున్నాడు.

''వీడు అమ్మ కావాలి అని ఒకటే గొడవ చేస్తున్నాడు .చూపించి వెంటనే తీసికెళదామని వచ్చాను. పోనీ వీడిని నీ దగ్గరే వుంచుకో కూడదూ!'' సంశయిస్తూ అడిగాడు ఆ వ్యక్తి. ఆ మాటలకు అనూష కళ్ళు కోపంతో ఎరుపెక్కాయి.

''నువ్వు నా భర్తవనీ, వీడు నా కొడుకని నేను ఆ వూళ్ళోనే మర్చిపోయి వచ్చాను. ఇప్పుడిక్కడున్నది ఆ నాటి అనసూయ కాదు. అనూష. మిస్ అనూష. ఈ రహస్యం ఎక్కడన్నా పొక్కిందా నీ ప్రాణాలు తీయించడానికి కూడా వెనుకాడను. వెళ్ళు! ఈ వెయ్యి రూపాయిలు తీసుకొని వీడిని వెంట బెట్టుకొని వెళ్ళిపో'' అన్నది. ఏదో చెప్ప బోయాడు ఆ వ్యక్తి.

# బొమ్మా బొరుసు

-ఇ.టి. రామారావు





''వెళ్ళిపో! యింకేమీ మాట్లాడకు. నాకు పెళ్ళయిందని, ఒక కొడుకు కూడా వున్నాడని యీ ఫీల్డులో తెలిస్తే ఇప్పుడిప్పుడే పెరుగుతున్న నా మార్కెట్టు, గ్లామర్ ఒక్క దెబ్బతో పడిపోతాయి. అలాంటి స్థితిని నేను వూహించలేను, భరించలేను'' అన్నది పైకి లేస్తూ అనూష.

''ఈ రాత్రికి వుండి వుదయాన్నే వెళ్ళి పోతాం!'' అన్నాడావ్యక్తి. ''వీల్లేదు. హిందీ నిర్మాత ఒకతను వస్తానన్నాడు కాల్‌షీటు విషయం మాట్లాడటానికి. మిమ్మల్నిక్కడ చూస్తే బాగుండదు. రైల్వేస్టేషన్‌లో వుండి రైలెక్కి వెళ్ళిపొండి'' అన్నది లోనికి నడుస్తూ.

ఆ వ్యక్తి పసివాడిని దగ్గరగా తీసుకొని భారంగా బయటికి నడిచాడు.

తల్లి కనిపిస్తుందేమోనని వెనక్కి తిరిగి తిరిగి యింట్లోకి చూస్తున్నాడు ఆ కుర్రవాడు. ●

